టీపీసీసీ చీఫ్‌కు ఘన స్వాగతం



టీపీసీసీ చీఫ్‌కు స్వాగతం పలుకుతున్న కొలన్ హన్మంతరెడ్డి

కుత్బుల్లాపూర్: సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ మేడ్చల్‌కు విచ్చేశారు. ఆయనకు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి కార్యకర్తలతో కలిసి ఘన స్వాగతం పలికారు. మహేష్‌కుమార్‌గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

ముళ్ల చెట్లను తొలగించండి



జీడిమెట్ల: రోడ్డు పక్కన పెరిగిన కలుపు మొక్కలను తొలగించి ఇబ్బంది లేకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు. జీడిమెట్ల ఎస్వీ కో ఆపరేటివ్ సొసైటీలోని అతులిత ఫార్మా రోడ్డులో రోడ్డు పక్కన ముళ్లచెట్లు పెరిగి రోడ్డుపైకి రావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సొసైటీ అధికారులు పట్టించుకుని ముళ్లచెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



పంచశీల కాలనీలోని రోడ్డు నంబర్ 12లో చెట్టు కొమ్మల నుంచి ఉన్న విద్యుత్ తీగలు


రంగారెడ్డినగర్: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో తీగలు కిందకు జారి ప్రమాదకరంగా మారాయి. రంగారెడ్డినగర్ డివిజన్ పంచశీల కాలనీలోని రోడ్డు నంబరు 12లో విద్యుత్ తీగలు కిందకు జారాయి. సమీపంలోని చెట్ల కొమ్మలు తాకుతుండటంతో తరచూ విద్యుత్ ట్రిప్ అయి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెట్ల కొమ్మలను తొలగించేందుకు తరచూ సరఫరా నిలిపి వేస్తున్న అధికారులు.. పంచశీల కాలనీలో తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు కనిపించడం లేదా? అని ప్రశ్నిస్తున్నారు.

ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఫెలోగా ప్రొ.సురజిత్‌ధారా

రాయదుర్గం: హెచ్‌సీయూ ప్రొఫెసర్ సురజిత్ ధార బెంగళూరులోని ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్–2025 ఫెలోగా ఎన్నికయ్యారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ ఫిజిక్స్‌లో ఆయన విధులను నిర్వహిస్తున్నారు.లిక్విడ్ క్రిస్టల్ సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించి లిక్విడ్ క్రిస్టల్ పరికరాల సాంకేతికతను ఆయన అభివృద్ధి చేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

'మనూ'లో 23న వర్క్‌షాప్

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్ (ఐఎంసీ) ఆధ్వర్యంలో 23న వర్క్‌షాప్ జరుగుతుందని ఐఎంసీ డైరెక్టర్ రిజ్వాన్ అహ్మద్ బుధవారం తెలిపారు. ఆసక్తి కలవారు 17వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రముఖ కమ్యూనిటీ రేడియో నిపుణులు, హెచ్‌సీయూ ప్రొఫెసర్ వినోద్ పవరాల, ప్రొఫెసర్ డాక్టర్ శ్రీధర్, మన టివి మాజీ సీఈఓ డాక్టర్ రామారావు, కేంద్ర సమాచార శాఖ సీఆర్ఎస్ సెల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ అమిత్ ద్వివేది ఈ వర్క్‌షాప్‌లో పాల్గొంటారని వివరించారు.



బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. జీడిమెట్ల డివిజన్ కార్పొరేటర్ తారాచంద్రారెడ్డి కార్యాలయంలో కేక్ కట్ చేశారు. - కుత్బుల్లాపూర్

బీజేపీకి కొత్త సారథులు

- పూర్తయిన బూత్, మండల కమిటీలు
- పార్టీ కార్యకలాపాలకు అనుగుణంగా ఐదు అసెంబ్లీ స్థానాలు రెండు జిల్లా కమిటీలుగా విభజన
- అర్బన్, రూరల్ జిల్లా కమిటీల అధ్యక్ష స్థానాలకు పోటాపోటీ
- ఈ నెల 20 కల్లా అధ్యక్షుల పేర్లను ప్రకటించనున్న అధిష్ఠానం



పటోళ్ల విక్రంరెడ్డి



తిరుమల్‌రెడ్డి



శ్రీనివాస పటేల్





మాధవరం కాంతారావు



నందనం దివాకర్



భానుప్రకాష్

సాక్షి, సిటీబ్యూరో: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే భారతీయ జనతా పార్టీ (బీజేపీ)కి కొత్త రథసారథులు రానున్నారు. ఈ నెల 20 కల్లా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని రూరల్, అర్బన్ బీజేపీ జిల్లా అధ్యక్షులను అధికారికంగా ప్రకటించేందుకు అధిష్ఠానం కసరత్తు చేస్తోంది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన తర్వాత బీజేపీ సంస్థాగత బలోపేతంపై దృష్టి సారించింది. సభ్యత్వ నమోదు మొదలు.. బూత్ కమిటీలు, మండల కమిటీలపై కొంత కాలంగా కసరత్తు చేపట్టింది. ముఖ్య కార్యకర్తలు, కేడర్ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవటం ద్వారా వాటిని పూర్తి చేసింది. శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఆవిర్భావం తర్వాత ఇందులోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలను కలిపి భారతీయ జనతా పార్టీ ఒక జిల్లా కమిటీని కొనసాగించింది. అప్పట్లో అధ్యక్షుడిగా బీజేపీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు పూర్తి స్థాయిలో బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత పార్టీ కార్యక్రమాల విస్తరణ తదితర కారణాల నేపథ్యంలో జిల్లా కమిటీని ప్రస్తుతం రూరల్, అర్బన్ జిల్లా కమిటీలుగా ఏర్పాటు చేశారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంతోపాటు 13 పురపాలక సంఘాలు, 62 గ్రామ పంచాయతీలను కలుపుతూ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రూరల్ జిల్లా కమిటీని ఏర్పాటు చేసింది. జిల్లా అధ్యక్షుడిగా పటోళ్ల విక్రంరెడ్డి కొనసాగుతున్నారు. కూకట్‌పల్లి, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గాలను కలుపుతూ మేడ్చల్ అర్బన్ జిల్లాను ఏర్పాటు చేయగా.. బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కమిటీ అధ్యక్షుడిగా హరీష్‌రెడ్డిని నియమించారు. అతను పార్లమెంట్ ఎన్నికల ముందు అర్బన్ జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేయటంతో బీజేపీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్.మల్లారెడ్డికి అర్బన్ జిల్లా ఇన్‌చార్జిగా పార్టీ అధిష్ఠానం బాధ్యతలను అప్పగించింది.

సెగ్మెంట్ల విభజనపై పార్టీలో తర్జన భర్జన

దేశంలోని అతిపెద్ద పార్లమెంట్ స్థానం మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాన్ని అత్యధిక మెజార్టీతో బీజేపీ కైవసం చేసుకుంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కమిటీని ప్రస్తుతం ఉన్నట్లుగానే కొనసాగించాలా.. లేక రెండు లేదా మూడు అసెంబ్లీ నియోజకవర్గాలను కలుపుతూ.. జిల్లా కమిటీలను ఏర్పాటు చేయాలా? అనే విషయంపై పార్టీ నాయకుల్లో తర్జన భర్జన జరుగుతోంది. కొత్తగా ఏర్పాటు చేయనున్న రెండు జిల్లా కమిటీలలో మేడ్చల్, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలను కలుపుతూ రూరల్ జిల్లా కమిటీ, ఉప్పల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గాలను కలుపుతూ అర్బన్ జిల్లా కమిటీగా ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందన్న విషయంపై నాయకులతో పాటు కేడర్‌లో వాడీవేడి చర్చ సాగుతోంది.

- అలాగే ఉప్పల్, మల్కాజిగిరి, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గాలను కలుతూ అర్బన్ జిల్లా కమిటీగా, మేడ్చల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలను కలుపుతూ రూరల్ జిల్లా కమిటీగా ఏర్పాటు చేయాలన్న అభిప్రాయాలు కూడా నేతల్లో వ్యక్తమవుతోంది. పార్టీ అధిష్ఠానం ముందు జిల్లా నాయకులు అర్బన్, రూరల్ జిల్లా కమిటీలకు సంబంధించిన ప్రతిపాదలను పెట్టారు. తుది నిర్ణయంతో కొత్త జిల్లా రథసారథులను త్వరలో ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అధిష్ఠానం బూత్, మండల కమిటీలతో సహా ముఖ్య నేతల నుంచి కొత్త రథసారథుల నియామకంపై అభిప్రాయాలను సేకరించటం ద్వారా నేతల పేర్లను కూడా ఖరారు చేసినట్లు తెలుస్తోంది.

అధ్యక్ష పదవులపై పోటాపోటీ

భారతీయ జనతాపార్టీ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అర్బన్, రూరల్ కమిటీలకు కొత్త రథ సారథులను త్వరలో నియమించనుండటంతో ఆసక్తి కనబరిచే నేతల్లో పోటీ కూడా తీవ్రంగా ఉంది. మేడ్చల్ రూరల్ జిల్లా కమిటీ అధ్యక్ష పదవికి 11 మంది నాయకులు దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డితో సహా జిల్లా నాయకులు జిల్లాల తిరుమల్‌రెడ్డి, బుద్ధి శ్రీనివాసపటేల్, సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, శోభారెడ్డి, కూరపాటి విజయకుమార్ పోటీ పడుతున్నారు. పటోళ్ల విక్రంరెడ్డి రూరల్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగలేనని పేర్కొంటే తప్ప.. ఇతరులకు ఆ పదవిని కట్టబెట్టవచ్చునన్న చర్చ పార్టీ వర్గాల్లో కొనసాగుతోంది. అలాగే అర్బన్ జిల్లా కమిటీ అధ్యక్ష పదవికి నందనం దివాకర్, భాను ప్రకాష్, డాక్టర్ శిల్పారెడ్డి, అడ్వకేట్ ప్రసన్న , శ్రీనివాస్ ముదిరాజ్ పోటీ పడుతున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఆవిర్భావం తర్వాత ప్రథమంగా ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలతో ఏర్పడిన బీజేపీ జిల్లా కమిటీకి అధ్యక్షుడిగా పని చేసిన కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావును కూడా పార్టీ అధిష్ఠాన వర్గం నియమించవచ్చుననే ప్రచారం కూడా జరుగుతోంది.

బీజేపీ డివిజన్ అధ్యక్షుల నియామకం

కుత్బుల్లాపూర్ : నియోజకవర్గ పరిధిలోని పలు మున్సిపాలిటీలకు డివిజన్ అధ్యక్షులను బీజేపీ అధిష్ఠానం బాధ్యులను నియమించింది. జీడిమెట్ల డివిజన్ –జోగిని రాజు యాదవ్, చింతల్ డివిజన్– డి రాజేష్ చారి, రంగారెడ్డి నగర్ డివిజన్– బి మణికంఠ, ప్రగతి నగర్ –నరేంద్ర చౌదరి, బాచుపల్లి –ప్రసాద్ రాజు, దుండిగల్ మున్సిపాలిటీకి – పీసరి కృష్ణారెడ్డి, కొంపల్లి మున్సిపాలిటీకి –సతీష్ సాగర్‌లను నియమిస్తూ బీజేపీ జిల్లా ఎలక్షన్ ఆఫీసర్ ఆచార్య ఉత్తర్వులు జారీ చేశారు.

జిల్లా కౌన్సిల్ మెంబర్లుగా నియామకం

బీజేపీ సీనియర్ నేతలకు జిల్లా కౌన్సిల్ మెంబర్లుగా అవకాశం కల్పించారు. పులి బలరాం, పత్తి సతీష్, పి వేణు, జనార్దన్ రెడ్డి, డాక్టర్ ఎం ఆర్ ఎస్ రాజు, వెంకట సుబ్బారావు, ఏ మల్లేష్ యాదవ్‌లను జిల్లా కౌన్సిల్ మెంబర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మరో ఐదు డివిజన్లు, నిజాంపేట్ కార్పొరేషన్ బాధ్యులను నియమించాల్సి ఉంది. త్వరలోనే ఈ ప్రక్రియ పూర్తి చేస్తామని జిల్లా ఎన్నికల బాధ్యులు తెలిపారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్: అనారోగ్యంతో ఓ వ్యక్తి విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లాకు చెందిన ఆర్ రాజేందర్ రెడ్డి (37) సుభాష్ నగర్‌లో నివసిస్తూ ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. మంగళవారం భార్య, పిల్లలను పండుగకు పుట్టింటికి పంపించాడు. ఇటీవలే అతని తల్లి మృతి చెందగా.. అప్పటి నుంచి అతను సైతం తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'చెత్త' వివాదం!

- తమ పరిధి కాదంటున్న కుత్బుల్లాపూర్, అల్వాల్ సర్కిళ్ల సిబ్బంది
- చెత్త నిల్వతో కాలనీవాసులకు తిప్పలు



రోడ్డుపై వేస్తున్న చెత్తా, చెదారం

కుత్బుల్లాపూర్: చెత్త తరలింపు విషయంలో రెండు సర్కిళ్ల మధ్య పని చేస్తున్న సిబ్బందికి ఇబ్బందికరంగా మారింది. మీ ప్రాంతం నుంచి చెత్త తీసుకువచ్చి మా ప్రాంతంలో వేస్తున్నారని ఒకవైపు.. లేదు మీరే తీసుకువచ్చి వేస్తున్నారని ఇంకోవైపు. ఇలా కుత్బుల్లాపూర్, అల్వాల్ సర్కిల్ బార్డర్‌లో ఉన్న మీనాక్షి కాలనీ– లయోలా అకాడమీ ప్రధాన రోడ్డు వెంట ఉన్న చెత్త సమస్యపై ప్రతి రోజు వివాదం జరుగుతోంది. కొంతమంది ఆటోలో చెత్తను తీసుకువచ్చి ఇక్కడ వేస్తుండగా.. మరి కొంతమంది చెత్త రిక్షాల్లో తీసుకువచ్చి వేస్తున్నారు. అయితే రెండు సర్కిల మధ్య పని చేస్తున్న సిబ్బంది మాత్రం అది తమ పరిధి కాదంటూ చేతులెత్తేయడం మూలంగా తీవ్ర దుర్గంధం వస్తుందని మీనాక్షి కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్యను గుర్తించి పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

పార్కుల్లో చిన్నారుల సందడి

జీడిమెట్ల: సంక్రాంతి సెలవుల సందర్భంగా పార్కుల్లో చిన్నారుల సందడి అంతా ఇంతా కాదు. జీడిమెట్ల ఎస్.ఆర్‌నాయక్‌నగర్‌లోని ప్రశాంతవనం పార్కును మూడు రోజులుగా ప్రజలు ఎక్కువగా సందర్శిస్తున్నారు. మంగళవారం ఒక్కరోజే పార్కులో రూ.8500 వసూలు అయ్యిందని నిర్వాహకులు తెలిపారు. పార్కులో చిన్నారులు ఆడుకునేందుకు, పెద్దలు వాకింగ్ చేసేందుకు వీలుగా ఉండటంతో సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉందని నిర్వాహకులు తెలిపారు.



ప్రశాంతవనం పార్కులో ఆడుకుంటున్న చిన్నారులు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జగద్గిరిగుట్ట: మూర్ఛ వ్యాధితో ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆల్విన్ కాలనీ జలకన్య హోటల్ సమీపంలో ఈ నెల 9న ఓ గుర్తు తెలియని వ్యక్తి(35)కి ఫిట్స్ వచ్చింది. దీంతో స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా.. వారు గాంధీ ఆస్పత్రికి తరలించారు. సదరు వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పరిస్థితి విషమించి..

జగద్గిరిగుట్ట: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడటంతో గాయాలై చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఈ ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆస్‌బెస్టాస్ కాలనీకి చెందిన పి.నారాయణ స్వామి(59) సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. అతని మనవరాలు ప్రసన్న కూకట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో రిసెప్షనిస్టుగా పని చేస్తుంది. నారాయణ స్వామి ప్రతి రోజు తన మనవరాలిని ఆస్పత్రి వద్ద దింపి తీసుకువస్తుంటాడు. ఈ నెల 10వ తేదీన బైక్‌పై మనవరాలిని డ్రాప్ చేసేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో బైక్ అదుపు తప్పి కిందపడటంతో నారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రసన్నకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. నారాయణ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ప్రసన్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

బాలానగర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలిక అదృశ్యమైంది. ఈ ఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ టి. నరసింహరాజు వివరాల ప్రకారం.. గౌతమ్ నగర్‌కు చెందిన కొడవత్ లక్ష్మణ్ చిన్న కుమార్తె (15) బయటకు వెళుతున్నానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరణ



కేలండర్ ఆవిష్కరిస్తున్న టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం, మహేష్ గౌడ్

కూకట్‌పల్లి: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గాజుల మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో కేలండర్‌ను టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం బుధవారం ఆవిష్కరించారు. సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏ, బీ బ్లాక్ అధ్యక్షులు పి. నాగిరెడ్డి, తూము వేణు, ఏ, బీ బ్లాక్ మహిళా అధ్య క్షురాళ్లు రమాదేవి, సంధ్య, రాష్ట్ర మహిళా నాయకురాలు జ్యోతి, డివిజన్ అధ్యక్షులు కృష్ణరాజ్‌పుత్, తమ్మినేని ప్రవీణ్, మల్లికార్జున్ యాదవ్, డివిజన్ మహిళా అధ్యక్షురాళ్లు జోజమ్మ, మారుతి, కృష్ణవేణి, భారతమ్మ, జ్యోతి, బండి సుధ, ఏఎంసీ వైస్ చైర్మన్ ప్రకాష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

ఆకతాయిల ఆట కట్టించేందుకే పెట్రోలింగ్



కాలనీవాసులతో జీడిమెట్ల పోలీసులు

జీడిమెట్ల: ఆకతాయిల పని పట్టేందుకు జీడిమెట్ల పోలీసులు ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. జీడిమెట్ల పీఎస్ పరిధిలోని లాల్‌బహదూర్‌శాస్త్రి నగర్, న్యూ ఎల్‌బీనగర్‌లలో ఇటీవల పోకిరీల బెడద ఎక్కువైందని స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు బుధవారం రెండు కాలనీల్లో కలియతిరిగారు. ఎక్కడైతే పోకిరీల బెడద ఎక్కువగా ఉందో అక్కడ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని స్థానికులకు సూచించారు. దీంతో పాటు గోడదూకి కాలనీల్లోకి పోకిరీలు రాకుండా చర్యలు చేపట్టారు. ఎవరైనా వేధిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ గడ్డం మల్లేష్, డీఐ కనకయ్య, ఎస్ఐ ప్రేమ్‌కుమార్, ఏఎస్ఐ వెంకటరాంరెడ్డి, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలు.. వ్యక్తి ఆత్మహత్య



బండ నవీన్(ఫైల్)

కుత్బుల్లాపూర్: కుటుంబ కలహాల నేపథ్యంలో సంక్రాంతి పండుగ రోజు ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. చింతల్ పరిధిలోని దత్తాత్రేయ నగర్ ప్రాంతానికి చెందిన బండ నవీన్ (35) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. వీరి కుటుంబంలో అంతర్గత కలహాలు జరుగుతున్నాయి. మనస్థాపానికి గురైై ఈ నెల 14న ఉదయం 6:30 గంటల సమయంలో ఇంట్లో ఉన్న సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు తలుపులు పగలగొట్టి చూడగా.. ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరు మండలం మైస గ్రామంలో అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు - కూకట్‌పల్లి

అధికారుల అలసత్వం.. ప్రయాణికులకు అవస్థలు



శ్రీనివాస్‌నగర్ బస్టాప్‌లో పార్కింగ్ చేసిన ఆటో



జీడిమెట్ల బస్టాప్ వద్ద డంప్ చేసిన పైపులు

చింతల్: బాలానగర్ నుంచి జీడిమెట్ల వరకు వేయనున్న ఓ పైపులైన్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల ఆర్టీసీ ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. కాంట్రాక్టర్ ఆ పైపులను తీసుకువచ్చి రోడ్డు వెంట పరుచుకుంటూ వెళ్లాడు. జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న బస్టాప్ ముందుగా ఈ పైపులను వేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా జగద్గిరిగుట్ట డివిజన్ శ్రీనివాస్‌నగర్‌లో ఉన్న ఆర్టీసీ బస్టాప్ పార్కింగ్‌కు అడ్డాగా మారింది. స్థానికంగా ఉండే ఓ వ్యక్తి తన ఆటోను ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేస్తే ఎలా అనుకున్నాడో ఏమో కానీ ఏకంగా బస్టాప్‌ని పార్కింగ్‌గా మార్చేశాడు. అధికారులు స్పందించి బస్టాప్ వద్ద పైపులను, అక్రమ పార్కింగ్‌ను తొలగించాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మేరు కేశవులు సేవలు మరువలేం



చిత్రపటం వద్ద పూలమాలేసి నివాళి అర్పిస్తున్న జావెద్ అలీ తదితరులు

మోతీనగర్: తెలంగాణ సాయుధ పోరాటంలో దివంగత మాజీ మంత్రి మేరు కేశవులు పాత్ర ఎనలేనిదని టీపీసీసీ మాజీ ఆర్గనైజర్ సెక్రటరీ ఎస్.కే. జావిద్ అలీ అన్నారు. బుధవారం మేరు కేశవులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంతో పాటు సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఆయన ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా ఉన్నప్పుడు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా నిలిచారని స్మరించుకున్నారు.

శిల్పారామం.. సంక్రాంతి సంబురాలు



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహించిన సంక్రాంతి సంబురాలు అంబరాన్నంటాయి. బుధవారం నగరవాసులు అధిక సంఖ్యలో పాల్గొని సరదాగా గడిపారు. సంబురాలలో గంగిరెద్దులు, హరిదాసులు, బుడబుక్కల, జంగమ దేవరలు, ఎరుకల సాని ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. సౌత్‌జోన్ కల్చరల్ సెంటర్ ఆధ్వర్యంలో యక్షగానం, గారడి గొంబే జానపద నృత్యాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కనుమ పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలలో శ్రీ శ్రీనివాస సంస్థాన్ వారు మహిషాసుర మర్దిని, యక్షగానం, నాట్యగురువులు పద్మకళ్యాణ్ శిష్యబృందంచే వినాయకకౌతం, జయజయ దుర్గే, జతిస్వరం, తిల్లాన తదితర అంశాలను కళాకారులు డాక్టర్ జ్యోతి శేఖర్, లహరి, తన్మయి, జానకిశృతి, త్రిపుర, శ్రీలక, ఆద్య, సహస్ర, ఉదయశ్రీ, అవంతిక, వరుణ్య, లక్ష్మి, హాసిని తదితరులు ప్రదర్శించారు.